క్లుప్తంగా...

ముమ్మరంగా వాహనాల తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

దుండిగల్: దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాలుగు ప్రాంతాల్లో పోలీసులు సోమవారం రాత్రి నాకాబందీ నిర్వహించారు. మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి, దుండిగల్ సీఐ సతీష్, డీఐ బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నలుగురు ఎస్సైలు, 50 మంది కానిస్టేబుళ్లు ఏకకాలంలో నాకాబందీ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 24 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు, నాలుగు టైర్ల ఐదు వాహనాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేని 9 బైక్‌లు, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో చలాన్లు ఉన్న 10 బైక్‌లు, త్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్ రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న 116 చలాన్లకు సంబంధించిన రూ.44,140 వేలను వసూలు చేశారు.

విద్యుత్ అధికారుల బస్తీబాట



సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని జగద్గిరినగర్‌లో తరుచూ విద్యుత్ సమస్యలు ఏర్పడుతున్నాయి. నాయకులు ఫిర్యాదుతో మంగళవారం డీఈ జాన్‌రాజు, ఏడీఈ శ్రీకాంత్, ఏఈ రాధాకృష్ణ పర్యటించారు. ట్రాన్స్‌ఫార్మర్, కేబులు లైన్లను పరిశీలించారు. వీలైనంత తొందరగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జేకే శేఖర్‌యాదవ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సన్మానం



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శంభీపూర్ కృష్ణ

దుండిగల్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నియోజకవర్గ నాయకులు శంభీపూర్ కృష్ణ మంగళవారం కలిసి సన్మానించారు. పార్టీ అభివృద్ధికి వివిధ సూచనలు చేశారని కృష్ణ తెలిపారు.

చీఫ్ జస్టిస్‌పై దాడి.. రాజ్యాంగంపై దాడి



నిరసన తెలుపుతున్న నాయకులు

నిజాంపేట్: చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేయడం అంటే రాజ్యాంగంపై దాడి చేయడమేనని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బాలపీరు, సీఐటీయూ జిల్లా నాయకులు రాథోడ్ సంతోష్ అన్నారు. మంగళవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ.. దేశంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత సనాతన ధర్మం పేరుతో, మనుధర్మం పేరుతో దాడులు, హత్యలు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్వతంత్ర న్యాయ వ్యవస్థపై బహిరంగ దాడి జరిగిందన్నారు. కార్యక్రమంలో సి.రాజు, ఆశీర్వాదం, వెంకటేష్, రాజు, తుకారం తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్



ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

నిజాంపేట్: మియాపూర్ ట్రాఫిక్ సీఐ ప్రశాంత్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఈ డ్రైవ్ జరిగింది. ఈ డ్రైవ్‌లో భాగంగా నిజాంపేట్ హనుమాన్ దేవాలయం నుంచి నిజాంపేట్ ఎక్స్‌రోడ్డు వరకు రోడ్డుపై ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. వాహనదారులకు, పాదచారులకు ఇబ్బంది కలగిస్తున్న చిల్లర వ్యాపారుల స్టాళ్లు, తాత్కాలిక కట్టడాలను కూడా అధికారులు తొలగించారు. భవిష్యత్తులో కూడా తరచుగా ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రోడ్డు పనులు.. పూర్తయ్యేదెన్నడు?

- ఇరవై రోజులుగా ముందుకు సాగని పనులు
- కాంక్రీట్ పోసి పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్
- డ్రైనేజీ లైన్ కోసం గతంలో రోడ్డు తవ్వకాలు

సంవత్సర కాలంగా ఎదురు చూస్తున్న రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారంభించడంతో ప్రజలు సంతోష పడ్డారు. ఇరవై రోజుల క్రితం గల్లీల్లో తవ్వకాలు చేపట్టిన సదరు కాంట్రాక్టర్ ఒకటి, రెండు గల్లీల్లో కాంక్రీట్ పోసి మిగతా గల్లీల్లో కంకరతో సరిపెట్టడంతో స్థానికులకు కొత్త కష్టాలు మొదలయ్యాయి. అధికారులను అడిగితే దసరా పండుగ వచ్చిందిగా.. పండుగ తరువాత ప్రారంభిస్తారని చెబుతున్నారు. అయితే పండగ అయిపోయినా సదరు కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోవడంతో స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రంగారెడ్డినగర్: డివిజన్ పరిధి గిరినగర్‌లో దాదాపు సంవత్సరం క్రితం స్థానికంగా ఉన్న పలు గల్లీల్లో జలమండలి అధికారులు భూగర్భ డ్రైనేజీ లైన్లను వేశారు. పైపులైన్‌లు వేసే క్రమంలో రోడ్లను తవ్వి వదిలేయడంతో పైకి తేలిన డ్రైనేజీ మ్యాన్‌హోళ్లతో వాహనదారులు రాకపోకలకు ఆటంకంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రోడ్లు బురదమయంగా మారడంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై పలు మార్లు స్థానికులు సర్కిల్ అధికారులకు ప్రజావాణిలో ఫిర్యాదులు సైతం చేశారు. ఎట్టకేలకు స్పందించిన అధికారులు గిరినగర్ ఆంజనేయస్వామి ఆలయానికి అటు, ఇటుగా ఉన్న ఐదు గల్లీల్లో రోడ్లు వేసేందుకు రూ.50 లక్షల నిధులు మంజూరు చేయడంతో ఇరవై రోజుల క్రితం పనులు ప్రారంభించారు. మరో రెండు గల్లీలో పనులు ప్రారంభ దశలో ఉన్నాయి. దొడ్డు కంకర వేసి వదిలేయడంతో రాకపోకలు సాగించేందుకు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఇన్నాళ్లు కాలయాపన చేసిన అధికారులు తీరా వర్షాలు ప్రారంభం కాగానే పనులు చేపట్టడంపై రోడ్ల నాణ్యతపై ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు కాంక్రీట్ గట్టిపడకుండా కొట్టుకుపోయే ఆస్కార ముందని, ఇది రోడ్డు మన్నికపై ప్రభావం చూపనుందని పలువురు పేర్కొంటున్నారు.



గిరినగర్ ప్రధాన రోడ్డుపై నిలిపిన ద్విచక్ర వాహనాలు



గిరినగర్‌లో పనులు ప్రారంభం కాని ఓ గల్లీ

నాసిరకంగా పనులు..

సీసీ రోడ్డు కాంక్రీట్ విషయంలో నాసిరకంగా సదరు కాంట్రాక్టర్ పనులు చేపడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కాంక్రీట్‌కు సరిపడా సిమెంట్ కలపకుండా రాక్‌డస్ట్ వేయడంతో కాంక్రీట్ వేసిన ఐదు రోజులకే రాళ్లు పైకి తేలుతున్నాయి. దొడ్డు కంకరకు సైతం సిమెంట్ వేయకుండా డస్ట్ కలిపి వేయడం గమనార్హం. రోడ్డు పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నాడని గిరినగర్ వాసులు పేర్కొంటున్నారు.



నాసిరకం పనులతో కంకర తేలిన దృశ్యం



ఓ గల్లీలో డస్ట్‌తో దొడ్డు కంకర

తప్పని తిప్పలు

పలు గల్లీలో రోడ్డును తవ్వే క్రమంలో ఇళ్ల ముందున్న మెట్లను తవ్వేశారు. దీంతో కిందకు దిగే క్రమంలో మహిళలు, వృద్ధులు జారి పడుతున్నారు. రోజుల తరబడి పనులు చేపట్టకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు వెంటనే పనులు మొదలు పెట్టి పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



సగం పనులతో నిలిచిపోయిన రోడ్డు పనులు

రోడ్లపైనే వాహనాలు..

పదిహేను రోజుల క్రితం రోడ్డు పేరుతో తవ్వకాలు చేపట్టిన సదరు కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోవడంతో పలు గల్లీలకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో స్థానికులు తమ ద్విచక్ర వాహనాలను అంతర్గత రోడ్డుకు అనుసంధానంగా ఉన్న ప్రధాన రోడ్డు పక్కన నిలుపుతున్నారు. అయితే రోజుల తరబడి వాహనాలను ప్రధాన రోడ్డుపై నిలపడంతో ఎక్కడ చోరీకి గురవుతాయోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు త్వరిత గతిన రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



ఐఈఈఈ చైర్ ఫర్ రిలేషన్స్ సీతారామ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

దుండిగల్: విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని హైదరాబాద్ ఐఈఈఈ చైర్ ఫర్ రిలేషన్స్ సీతారామ్ తాడేపల్లి, యునిసన్ త్రీ ఎక్స్ టెక్నికల్ హెడ్ డాక్టర్ అతుస్‌రాయ్ చౌదరి అన్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఐఈఈఈఇ) డే ను మంగళవారం దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ ఐటీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సినర్జీ ఆఫ్ మైండ్స్, ఇంజనీరింగ్, మెడిసిన్, అండ్ పవర్ ఆఫ్ స్టాండర్స్ థీమ్‌తో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని తన అనుభవనాలను, ఇంజనీరింగ్, శాస్త్ర సాంకేతికత సంబంధిత అంశాలపై అవగాహన కల్పించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, బయో మెడికల్ పరికరాలు, టెలిమెడిసిన్ అభివృద్ధి తదితర అంశాలపై జరిగిన చర్చలో విద్యార్థులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, ఐక్యూఏసీ హెడ్ రాధికాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ కొనసాగుతూ!

కుత్బుల్లాపూర్: సుచిత్ర నుంచి కొంపల్లి వరకు నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. సంవత్సర కాలంగా ఇక్కడ పనులు కొనసా...గుతూ ఉన్నాయి. ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా సాగుతుంది. సంబంధిత శాఖ అధికారులు ఈ విషయంపై నిర్లక్ష్యం వహించడం మూలంగా ప్రతిరోజు ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు మత్యువాత పడుతున్నారు. మరికొంతమంది తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సుమారు 400 కోట్ల రూపాయలకు పైగా నిధులు వెచ్చించి ఇక్కడ నాలుగు ఫ్లైఓవర్ లో నిర్మాణంతో పాటు అండర్ పాస్ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించి పనులు ప్రారంభించారు. ఆ పనులు నత్తనడకన సాగుతుండడంతో ప్రతిరోజు ఉదయం మధ్యాహ్నం సాయంత్రం వేళల్లో వాహనదారులు నరకం చూస్తున్నారు. ఈ విషయంపై అధికారులు స్పందించి వెంటనే పనులు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పేట్‌బషీరాబాద్ డీమార్ట్ వద్ద నిలిచిన పనులు

పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు

- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: పార్టీలకు అతీతంగా అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. మంగళవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, జగన్, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి శ్రీశైలంగౌడ్‌ను కలిసి అభివృద్ధి పనులపై చర్చించారు. తమ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకువెళ్లి అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు వేగవంతం అయ్యేలా కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



శ్రీశైలంగౌడ్‌ను కలిసిన కార్పొరేటర్లు జగన్, సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి తదితరులు

రోజుల తరబడి రోడ్డుపైనే వరదనీరు

రంగారెడ్డినగర్: వరదనీరు బయటకు వెళ్లేదారి లేక రోజుల తరబడి నిల్వ ఉండటంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి రంగారెడ్డినగర్ బస్టాప్ సమీపంలో ఇటీవల కురిసిన వర్షాలకు వరద వచ్చి చేరింది. నీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వరదనీరు పదిహేను రోజులుగా నిల్వ ఉండటంతో తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమల వృద్ధికి కేంద్రంగా మారింది. ఈ ప్రాంతంలో డ్రెయిన్ లేకపోవడంతో వర్షం పడ్డ ప్రతిసారి తాము ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు విస్మయంవ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతం గాంధీనగర్ ఐలా పరిధిలోకి రావడంతో జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల ఐడీపీఎల్ రోడ్డులోని ఎర్రగొడల నుంచి రంగారెడ్డినగర్ స్వామి వివేకానంద విగ్రహం వరకు డ్రెయిన్ లైన్ నిర్మాణం పూర్తి చేసిన ఐలా అధికారులు బస్టాప్ ప్రాంతంలో పనులు పూర్తి చేయలేదు. ఇప్పటికైనా ఐలా అధికారులు వరద నిల్వకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



అంబేడ్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు



హన్మంత్‌రెడ్డిని సన్మానిస్తున్న అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు

నిజాంపేట్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్‌పల్లి 14వ వార్డు అంబేడ్కర్ భవనం శిథిలావస్థకు చేరింది. ఈ విషయంపై యువజన సంఘం సభ్యులు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన శిథిలావస్థకు చేరుకున్న భవనాన్ని పరిశీలించారు. సంబంధిత అధికారులు, కలెక్టర్‌తో మాట్లాడి శిథిలావస్థలో ఉన్న భవనాన్ని వెంటనే తొలగించి, జీ ప్లస్ వన్ భవనాన్ని నిర్మించాలని కోరారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో స్పెషల్ ఫండ్ ద్వారా రూ.25 లక్షలు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మంగళవారం హన్మంత్‌రెడ్డిని కలిసి సన్మానించారు. త్వరలోనే నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దుడ్డు నర్సింగరావు, దుడ్డు రాహుల్, మాజీ సర్పంచ్ బండ నరసింహ, కొమ్ము బిక్షపతి, బండ వెంకటయ్య, బైండ్ల ఈశ్వర్, అంబేడ్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇంట్లో ఏసీ పేలి స్వల్ప గాయాలు

నిజాంపేట్: బాచుపల్లిలోని ఓ ఇంట్లో ఏసీ పేలిన సంఘటనలో ఓ వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్, చీరాలకు చెందిన జ్యోతి బాచుపల్లిలోని సాయి అనురాగ్ కాలనీ, ఎస్ఆర్‌కె ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటుంది. జ్యోతి (65) అప్పుడప్పుడు బాచుపల్లిలోని తాను ఉంటున్న ఫ్లాట్‌కి వచ్చి వెళ్తుంటారు. ఈ నేపథ్యంలోనే సోమవారం రాత్రి వచ్చిన జ్యోతి బెడ్‌రూమ్‌లోని ఏసీ వేసుకుని నిద్రించింది. మంగళవారం ఉదయం వంట చేసుకునేందుకు వంట గదిలోని గ్యాస్ స్టవ్ వెలిగించగా.. ఒక్కసారిగా బెడ్‌రూంలోని ఏసీ పేలిపోవడంతో ఇల్లు అంతా మంటలు చెలరేగాయి. పెద్ద శబ్దం రావడంతో ఇరుగు, పొరుగు వారు వచ్చి చూడగా జ్యోతికి స్వల్పగాయాలయ్యాయి. ఏసీకి సంబంధించిన వస్తువులు, కిచెన్‌లోని వస్తువులు, ఇంటి గోడలు, ఫర్నిచర్, సీలింగ్ ఫ్యాన్ అగ్నికి ఆహుతి అయ్యాయి. బాధితురాలిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. హైడ్రా, ఫైర్, పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ గృహకల్ప కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మంగళవారం పలువురు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాబేర్ అలీ, ఇంజినీరింగ్ సెక్షన్ ప్రవీణ్‌లను కలిసి రాజీవ్ గృహకల్పలోని పలు ప్రాంతాలలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పలు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కొలన్ హన్మంత్‌రెడ్డి, అధికారులు సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో జాషువా, రాందాస్, జార్జ్, నవీన్, రాజేష్, ఎల్లా స్వామి తదితరులు పాల్గొన్నారు.



పిటిషన్ల పరిష్కారంపై దృష్టి సారించాలి

- బాలానగర్ డీసీపీ సురేశ్ కుమార్

నిజాంపేట్: పిటిషన్ల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని బాలానగర్ డీసీపీ సురేష్‌కుమర్ అన్నారు. బాచుపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, ప్రభుత్వ ఆస్తులు, స్టేషన్ రికార్డులు పరిశీలించారు. తనిఖీ సందర్భంగా డీసీపీ ప్రజలతో మాట్లాడి పోలీస్ సేవలపై వారి అభిప్రాయాలను సేకరించారు. ప్రజలతో మరింత సాన్నిహిత్యం పెంచి, సేవా నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. పోలీస్ సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ పాటించడంపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించారు. కార్యక్రమంలో బాచుపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బఫర్ జోన్‌లో నిర్మాణాలపై ఫిర్యాదు



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆకుల సతీష్

దుండిగల్: దుండిగల్ మున్సిపల్ మల్లంపేట్‌లోని సర్వే నెంబర్ 170/3, 170/4 లలోని అక్రమ నిర్మాణాలపై బీజేపీ నాయకులు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో మంగళవారం ఫిర్యాదు చేశారు. గండిమైసమ్మ-దుండిగల్ తహసీల్దార్, దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్‌లకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. గతంలో చెరువు బఫర్ జోన్‌లో చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయగా.. తిరిగి అదే ప్రాంతంలో మరలా నిర్మాణాలు జరుగుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

పోగొట్టుకున్న ల్యాప్‌టాప్‌ను అందజేసిన ఆటో డ్రైవర్



ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న ఆటో డ్రైవర్ శ్రీనివాస్

సుభాష్‌నగర్: ప్రయాణిస్తున్న ఆటోలో మర్చిపోయిన ల్యాప్‌టాప్‌ను సదరు ప్రయాణికురాలికి అప్ప చెప్పి నిజాయితీని చాటుకున్నాడు ఓ ఆటో డ్రైవర్. మైసమ్మగూడలో ఇంజనీరింగ్ చదువుతున్న ఓ విద్యార్థిని కొంపల్లిలోని దూలపల్లి ఆటో స్టాండ్ వద్ద మైసమ్మగూడ వెళ్లేందుకు ఆటో ఎక్కింది. అనంతరం మైసమ్మగూడ వద్ద దిగింది. దీంతో సదరు వాహనం తిరిగి కొంపల్లి చేరుకుంది. ఆటోలో ఉన్న ల్యాప్‌టాప్‌ను గుర్తించిన డ్రైవర్ శ్రీనివాస్ టీయూసీఐ కొంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో అతను మైసమ్మగూడలో ఉంటున్న తోటి ఆటో డ్రైవర్లకు సమాచారం అందించారు. అప్పటికే పోగొట్టుకున్న ల్యాప్‌టాప్ కోసం కళాశాల సిబ్బంది, విద్యార్థిని వెతుకుతుండగా ఆటో డ్రైవర్లు వారికి ల్యాప్‌టాప్‌ను అందించారు. దీంతో స్థానికంగా ఉన్న పలువురు ఆటో డ్రైవర్‌ను అభినందించారు.